
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025

5

తూర్పుగోదావరి



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కార కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం '1100' మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. నమోదైన అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకోవచ్చున్నారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చునని తెలిపారు. అందుకోసం ప్రజలు వారి సెల్ఫోన్లలో ఈ నెంబర్ సేవ్ చేసుకోవాలని సూచించారు.

- జ్వరంతో వెళ్లినా తప్పని టెస్టులు
- కొరవడిన వైద్య శాఖ పర్యవేక్షణ

పరీక్షల దోపిడీ



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని పలు ప్రయివేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో అక్రమ దందాకు యథేచ్ఛగా పాల్పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో పాటు జ్వరం, జలుబు, దగ్గు ఇతర అనారోగ్య సమస్యలతో ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లే రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకున్నా పరీక్షలు చేస్తూ రోగుల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మామూలు జ్వరంతో ఆస్పత్రికి వెళ్లినా టెస్టులు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొన్ని ప్రయివేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేని సమయంలో ఎవరైనా వైద్యం కోసం వస్తే ఫోన్‌లో సూచనలు చేస్తూ కింది స్థాయి సిబ్బందితో చికిత్స చేయిస్తున్నారు. ప్రయివేటు ఆస్పత్రులలో నిర్లక్ష్యపు వైద్యంతో పలువురురోగులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. తాజాగా ఓ కాన్పుల ఆస్పత్రిలో శిశువు మరణం చర్చనీయాంశమైన విషయం విదితమే. ప్రయివేట్ ల్యాబ్ సెంటర్ల నిర్వాహకులు రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా గత నెల రోజులుగా విజృంభిస్తున్న విష జ్వరాలు బారిన పలువురు ఆసుపత్రిపాలు అవుతున్నారు. ఒకప్పుడు పల్లెలలో రోగి నాడి పట్టి కారణమేంటో తెలుసుకునేవారు. రోగి చెప్పిన లక్షణాలను బట్టి మందులిచ్చేవారు. అవి వాడిన ఫలితం కనిపించకపోతే పరీక్షలకు పంపేవారు. కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆర్ఎంపి వైద్యులు సైతం ముందుగా పరీక్షలకే ప్రిఫర్ చేస్తున్నారు. ఫలితాలు వెలువడిన అనంతరమే మందులు రాస్తున్నారు. దీన్నే అవకాశంగా మార్చుకుని కొన్ని ల్యాబ్‌ల నిర్వాహకులు అర్హతలేని టెక్నీషియన్లతో పరీక్షలు చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యులతో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 20 నుంచి 30 శాతం కమీషన్లు ఇస్తూ అడ్డగోలు ఫీజులు గుంజుతున్నారు. మరి కొంతమంది పరీక్షల అనంతరం రిపోర్టులు ఇవ్వకుండానే సెల్ఫోన్లకు టెక్స్ట్ మెసేజీ పంపించి అవే రిపోర్టులు అంటూ బిల్లులు వసూలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల హెచ్చరికలను సైతం పట్టించు కోవడం లేదు.

జిల్లాలో అధికారికంగా ప్రయివేట్ ఆస్పత్రులు 300 కాగా ల్యాబ్స్, డయోగ్నస్టిక్ సెంటర్లు మరో 266 ఉన్నాయి. కాగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు ఈ సంఖ్య ఐదు రెట్లు ఉంటాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క ల్యాబ్‌లో ఒక విధంగా అదనపు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. రక్తంలో కొవ్వు నిల్వల కోసం చేయించే లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్‌ల విషయంలో ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్న ల్యాబ్ సెంటర్లు, ఆసుపత్రులు మాత్రమే ల్యాబ్ సెంటర్లు ఏర్పాటు చేసి పరీక్షలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ ఆదేశాల పూర్తిగా బేఖాతరు చేస్తూ అర్హతలేని వారితో పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్ సెంటర్లలో మౌలిక వసతులు లేకపోవడం వీరికి కలిసి వస్తోంది. ప్రయివేటు సెంటర్లలో కొద్దిగా అనుభవం ఉన్న టెక్నీషియన్ ఉన్నట్లే నిర్వాహకులు పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక అర్హతలేని టెక్నీషియన్‌తో పరీక్షలు చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక డయాగ్నస్టిక్ సెంటర్ ఇచ్చిన రిపోర్టుకు, మరో సెంటర్ ఇచ్చే రిపోర్టుకు తేడా ఉంటోంది. జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లతో పాటు ప్రయివేటు స్కానింగ్ సెంటర్లలో చాలా ఏళ్లుగా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఇటీవల కలెక్టర్ హెచ్చరికలు జారీ చేసిన విషయం విదితమే. ఇప్పటికైనా ఇటువంటి అనుమతులు లేని డయోగ్నస్టిక్స్ సెంటర్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తాళ్లపూడిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పి నరసింహాకిషోర్, ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

1న మలకపల్లికి ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - కొవ్వూరు, తాళ్లపూడి

జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని తాళ్లపూడి మండలం మలకపల్లికి రానున్నారు. గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం పి.4 గ్రామ సభలో సిఎం పాల్గొంటారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ సిఎం పర్యటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం కార్యాలయ అధికారులు ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని భద్రతాపరమైన ఏర్పాట్లు, గ్రామసభ తదితర అంశాలపై హెలిప్యాడ్, రూట్ మ్యాప్‌పై, మెడికల్ క్యాంపు ఏర్పాటు, అగ్ని మాపక వ్యవస్థ ఏర్పాట్లు, విద్యుత్ సరఫరాపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల విషయంలో జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్లను సిఎం అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారు కుటుంబాలతో ముఖాముఖి కార్యక్రమంలో సిఎం పాల్గొంటారని అన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

సిఎం పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్పి డి.నరసింహాకిషోర్, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి మలకపల్లి గ్రామంలో కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. ఈ పర్యటన పూర్తి స్థాయిలో విజయవంతం చేయ డంలో, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రానున్న 24 గంటల సమయాన్ని వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పెన్షన్ పంపిణీ కోసం లబ్ధిదారుల గుర్తింపు, మార్గదర్శకాలతో, లబ్ధిదారు కుటుంబాలతో సిఎం ముఖాముఖి సంబంధించి జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ, డిఆర్‌డిఎ పిడీ వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామ సభ వేదిక ద్వారా ప్రజలను, గ్రామస్తులను ఉద్దేశించి సిఎం మాట్లాడతారని తెలిపారు. అందు కోసం ఆర్ అండ్ బి అధికారులు సభా వేదిక, హెలిప్యాడ్ ఏర్పాట్లను పూర్తి చేసి, భద్రత సిబ్బందికి వివరాలు వెల్లడించాలన్నారు. సౌండ్ సిస్టమ్, డిజిటల్ స్క్రీన్, ప్రత్యక్ష ప్రసారం, మీడియా సమన్వయం తదితర అంశాలను సమాచార శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్‌ను అనుసరించి ఏర్పాట్లను పర్యవేక్షణ చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒ రాణిసుస్మిత, సిపిఒ ఎల్.అప్పలకొండ, డిఆర్‌డిఎ పిడీ ఎన్‌విఎస్.మూర్తి, డిటిసిఅర్ఒ కె.లక్ష్మీనారాయణ, హౌసింగ్ పిడీ ఎల్.భాస్కర్ రెడ్డి, డిఈఒ ఎస్.సురేష్, డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ ఎస్‌బివి.రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి...

సిఎం హోదాలో తాళ్లపూడి మండలానికి చంద్రబాబు ముచ్చటగా మూడో సారి రానున్నారు. 2003 నవంబర్‌లో తాడిపూడి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకి వచ్చారు. రెండోసారి 2018 జనవరిలో జన్మభూమి కార్యక్రమానికి హాజరయ్యారు. ముచ్చటగా మూడోసారి ఈ ఏడాది జూలై 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేసేందుకు రానున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే హామీలు ఏమి ప్రకటిస్తారో అనే చర్చ నడుస్తోంది.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చాగల్లు

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు, రైతు సంఘం నాయకులు కంకటాల బుద్ధుడు, సిఐటియు నాయకులు టి.కొండయ్య, ఎస్‌కె. ఆదాం, బి.రమేష్, కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని మల్లవరం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శివజ్యోతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ కె.కైలాస నాగ హైమావతి, సభ్యులు కోర్పు వెంకటరాజు ప్రారంభించారు. డాక్టర్ ఆదిత్య విశ్వాస్ సహకారంతో జరిగిన శిబిరంలో రాజేశ్వరి రామకృష్ణన్ వైద్య సేవలందించారు. సుమారు 100 మందికి కంటి వైద్య పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శివజ్యోతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు



1న 'చలో రాజానగరం'

ప్రజాశక్తి - నిడదవోలు

రవాణా వాహనాల ఫిట్నెస్ తనిఖీని ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ జూలై 1న నిర్వహిస్తున్న చలో రాజానగరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆటో ఓనర్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్ వద్ద ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా వాహనాల ఫిట్నెస్ తనిఖీ ప్రయివేటీకరణ ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనిఖీల పేరుతో గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తున్నారని అన్నారు. వాహన తనిఖీ సందర్భంలో డామేజ్‌కి ఎటిఎస్‌కి ఎటువంటి సంబంధం లేదని, వాహన యజమానులను లోపలకి అనుమతించకుండా నైపుణ్యం లేని వారితో ఫిట్నెస్ చేయించడం వల్ల వాహనాల దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ సంఘాల జెఎసి ఆధ్వార్యాన జూలై 1న నిర్వహించే చలో రాజానగరం కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు ప్రసాద్, ఎల్లే కృష్ణంరాజు, సత్తుల రమేష్, రాజేష్, వేంకటేశ్వరరావు, యేసు, కరీం లాల్ బాషా, అన్వర్ పాల్గొన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన పది గంటల పని విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసేలా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో సంపద సృష్టి పెట్టుబడిదారులు చేస్తున్నప్పుడు, కార్మికుల పని గంటలు పెంచాల్సిన అవసరం ఎందుకొచ్చిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. పగటి పూటే భద్రత లేని సామాజిక పరిస్థితులలో రాత్రిళ్ళు పనిచేసే శ్రామిక మహిళల భద్రతకు ఎవరు భాద్యత వహిస్తారని నిలదీశారు. నిర్బంధంగా అధిక పనిగంటల పని చేయించడం వల్ల కార్మికుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చుపుతుందన్నారు. ఇప్పటికే అనేక శాస్త్రీయ పరిశోధనలు వెల్లడైందన్నారు. సమిష్టి కుటుంబ జీవన విధానానికి కార్మికుడు దూరమయ్యి కుటుంబాలు విశ్చిన్నం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కార్మికవర్గంపై చంద్రబాబు చేస్తున్న యుద్ధమని, తక్షణం పెంచిన పనిగంటల ఉపసంహరించుకోకపోతే కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించి నేటికి 14 సంవత్సరాలు కావొస్తుందన్నారు. ఈ కాలంలో ఇంటి పన్నులు, కరెంటు చార్జీలు, పెట్రోల్ ధరలు, నిత్యవసర ధరలు పెంచుతూ కార్మికుల వేతనాలు మాత్రం పెంచకపోతే ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. నిర్బంధపు ఓవర్ డ్యూటీ చేయించడాన్ని యాజమాన్యాలు మానుకోవాలన్నారు. భద్రత లేని రోజుల్లో శ్రామిక మహిళల చేత రాత్రిళ్ళు పని చేయించడం ఆపాలన్నారు. ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మద్దుకూరి దొరయ్య,బీరా రవి, సిహెచ్.మాణిక్యాంబ, మైగాపుల నాగేశ్వరరావు, మాణికిరెడ్డి హరిబాబు, జొన్నల రాంబాబు, రేఖ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

నగరంలో పర్యటించిన ఎంఎల్ఎ ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని పలు ప్రాంతాల్లో ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదివారం పర్యటించారు. స్థానిక 37వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే 10వ డివిజన్ పరిధిలోని తెలుకుల వాని చెరువు పార్కులో సందర్శకులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ.10 లక్షలతో చేపట్టే విద్యుత్ ఏర్పాట్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అనవసరమైన పనులు కాకుండా ప్రజలకు ఏం అవసరమో ఆ అభివృద్ధి పనులు మాత్రమే చేస్తున్నామన్నారు. గత వైసిపి పాలనలో అరకొర పనులు, ప్రజలు ఇబ్బందిపడేలా అనాలోచిత పనులు కాకుండా పూర్తి ఆలోచనలు, పక్కా ప్రణాళికతో శాశ్వతంగా నిలిచిఉండేలా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. 2027లో జరిగే పుష్కరాల నాటికి నగరం సర్వాంగ సుందరంగా ఉంటుందని, నగరంలో జరిగే పనులన్నీ కూడా పుష్కరాలకు ముందు... పుష్కరాల తరువాత అనే రీతిలో ఉంటాయన్నారు. ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు, వ్యాయామాలు చేసుకునేందుకు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కుల్లో జిమ్ సామాగ్రి, వాకింగ్ ట్రాక్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పర్యటనలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



13వ వార్డులో డ్రయినేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వాసు

పీజీ సెట్‌లో ఆర్ట్స్ కళాశాలకు ర్యాంకుల పంట

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (అటానమస్) విద్యార్థులు పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో వివిధ ర్యాంకులను సాధించారు. ఈ కళాశాలకి చెందిన 200 మంది పైగా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించడానికి వేసవి సెలవులలో నిర్వహించిన పీజీ కోచింగ్ వల్ల సాధ్యం అయిందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. గణిత విభాగానికి చెందిన ఎస్. కొమాళి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు. 60 మందికి పైగా విద్యార్థులు టాప్-1000లో ర్యాంకులు సాధించారు. 153, 209, 261 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించడం అభినందనీయమని అన్నారు. 150 మందికి పైగా విద్యార్థులు అన్ని విభాగాల్లో మంచి ర్యాంకులు సాధించారని, ఇందులో ఇంగ్లీష్ విభాగంలో 7, 35, 73 ర్యాంకులు, తెలుగులో 74, కామర్స్‌లో 22, 26, 47, 79, ఎకనామిక్స్‌లో 56, 63, 73, 78, లైఫ్ సైన్సెస్‌లో 18, 23, 34, 47, 67, 84, కెమికల్ సైన్సెస్‌లో 28, 46, 59, 73, ఫిజికల్ సైన్సెస్‌లో 3, 7, 10, 36, జియాలజీలో 16, 20, 24, 28, 40, 68, గణితంలో 6వ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్‌లో 8, 53, భూగోళ శాస్త్ర విభాగంలో 47వ ర్యాంకును తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాంమూర్తి, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్ర

బాబులు కుటుంబానికి జక్కంపూడి పరామర్శ

ప్రజాశక్తి - కడియం

ఇటీవల అనారోగ్యంతో మరణించిన బుర్రిలంక గ్రామానికి చెందిన నర్సరీ రైతు రత్నం వెంకట రామారావు(బాబులు) కుటుంబాన్ని మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులు రత్నం సూరిబాబు, నర్సరీ అసోసియేషన్ ట్రెజరర్ రత్నం బాబ్జిలను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాబులు చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, డాక్టర్ పరిమి చినబాబు, రత్నం శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి

వైద్య శిబిరంలో వెన్నెముక పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

స్థానిక సచివాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వెన్నుముఖ పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరంకు చెందిన వేద ఆసుపత్రి డాక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పలువురికి వెన్నుముఖ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వెన్నుముఖ నిపుణులు డాక్టర్ పి.తేజోఫణీంద్ర మాట్లాడుతూ తనకు మించిన బరువులను మోయడం వల్ల వెన్నుముఖ నొప్పులకు గురి అవుతున్నారని అన్నారు. వెన్నుముఖ, ఎముకలు గట్టిపడడానికి పౌష్టికాహారంతో కూడిన కాల్షియం ఆహారం తీసుకోవాలన్నారు. స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ పి.లక్ష్మీమృదుల మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ శిబిరాన్ని టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు ప్రారంభించారు.



వైద్య సేవలందిస్తున్న వేద ఆసుపత్రి వైద్యులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తేతలి సబ్ స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మతు పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. వడ్లూరు చివటం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామేని తెలిపారు. వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని అన్నారు.

కార్టూ'నిజం'



ఉండ్రాజవరంలో మంత్రి దుర్గేష్ పర్యటన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఉండ్రాజవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజానీకంతో ముఖాముఖి చర్చించారు. ఎదురుపడిన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ తక్షణమే పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త, వితంతు పెన్షన్లు, పిండప్రదానాలు చేసేందుకు అవసరమైన స్థలం, ధాన్యం సేకరణ డబ్బులు, వంగవీటి మోహనరంగ విగ్రహం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కొందరు గ్రామస్థులు మంత్రి దృష్టికి తమ సమస్యలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు త్వరలోనే జమ చేస్తామన్నారు. ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు పరిగణలోకి తీసుకొని సమస్యలు పరిష్కారిస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ అభివద్ధిని వివరించారు. అనంతరం ఉండ్రాజవరంలో ఇటీవల మృతి చెందిన జనసేన కార్యకర్త దువ్వాపు సత్యప్రకాష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.



ఉండ్రాజవరంలో పర్యటిస్తున్న మంత్రి కందుల దుర్గేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు జగన్‌కు లేదు

ప్రజాశక్తి - కడియం

దళితులను దారుణంగా హింసించిన వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శంచే అర్హత లేదని టిడిపి రాష్ట్ర కమిటీ సభ్యులు, జల్ది కృపారావు, జిల్లా కమిటీ సభ్యులు కాయల సత్యనారాయణ అన్నారు. ఆదివారం కడియపులంక దోసాలమ్మ కాలనీలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల ఎస్‌సి సెల్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంతో మంది దళితులను హింసించారని విమర్శంచారు. డాక్టర్ సుధాకర్‌ని బట్టలు విప్పి నడి రోడ్డుపై కొట్టి, పిచ్చివాన్ని చేసి, ఆయన మృతికి కారణమైన వైసిపి నేడు నీతులు చెబుతుందన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కనికెళ్ళ బుల్లియ్య, నాయకులు చింతపర్తి నాగేశ్వరరావు, మందపల్లి రత్నరాజు, బి.జాన్‌బాబు, జి.రాజుబాబు, విప్పర్తి శ్రీను, పత్తి ప్రకాష్, డి.సుబ్బారావు, పల్లి సురేష్, శీలం గోపాలం, ఎస్.కిషోర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని కాట్రేనికోన పంచాయతీ శివారుగచ్చకాయలపోరకు చెందిన మత్స్యకారుడు మూదే సుబ్బారావు (56) శనివారం రాత్రి అల్లిపర్రకు వెళ్లే వరి కాలువలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం రాత్రి వేళ చేపల వేటకు అల్లిపర్రకు వెళ్లిన సుబ్బారావు ఉదయం ఇంటికి రాలేదు. దీంతో ఆదివారం అతని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. అల్లిపర్రకు వెళ్లే వరి కాలువలో అతను శవమై తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమైనారు. చేపల కోసం వేసిన వల, చేపలుతో ఉన్న సంచి మతదేహం మొలకు ఉన్నాయి. మృతుడు మూదే సుబ్బారావుకు భార్య లక్ష్మి, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నాయి. కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు సహకారంతో కాట్రేనికోన పోలీసులకు, తహశీల్దారుకు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది శవపంచనామ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పోర్టుమార్టం నిర్వహించారు. బాధితుల పిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాండ్రేగులలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ వైఆర్కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎస్క్మి రఘునాథరావు వారి సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట జట్టు విజయం

ప్రజాశక్తి - జగ్గంపేట

కోరాడ సాయిరామ్ శ్రీనివాస్ (గిల్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట జట్టు విజయం సాధించింది. శ్రీనివాస్ తండ్రి కోరాడ సుబ్బారావు, కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంలో ఈ నెల 12న ప్రారంభమైన పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో 34 టీములు పాల్గొనగా జగ్గంపేట టీమ్ విన్నర్‌గా, గుర్రంపాలెం టీమ్ రన్నర్‌గా నిలిచాయి. వారికి టిడిపి మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం మొదటి బహుమతి రూ.25,555 నగదు, ట్రోఫీ అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన గుర్రంపాలెం టీముకు రూ.15,555 నగదుతో పాటు షీల్డ్‌ను, 3వ విజేతకు రూ.5,555 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కొండ్రోతు పైడియ్య, కొండ్రోతు నరసింహులు, ఆర్గనైజింగ్ టీమ్ ఆలీషా, కిరణ్, పీలా మణికంఠ, జాన్, పప్పీ, రాజు పాల్గొన్నారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్ద బజార్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు అమిత్ కుమార్ జైన్, సుమిత్ కుమార్ జైన్ మాట్లాడుతూ తమ తండ్రి అయిన బవర్లాల్ డి జైన్ ప్రారంభించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని 17వ శిబిరంగా కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నిర్వహించిన శిబిరంలో డాక్టర్ అశ్విన్, డాక్టర్ రే మున్నిసా కార్నియా మార్పు, రెప్పల వాలడాన్ని సరిచేయడం, మెల్ల కన్ను, రెటీనా, పిల్లలకు శుక్లాలు, నీటికాసులు ఇబ్బందులపై ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. 63 మంది ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అమిత్, సుమీత్ జైన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జైన్ కుటుంబ సభ్యులు, పరమేశ్వరి మెడికల్ షాపు అదినేత ఊర సత్యనారాయణ, లయన్స్ క్లబ్ నాయకుడు కర్రి ఆదినారాయణ రెడ్డి, కిరణ్ కంటి ఆసుపత్రి మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్టణంలో రోడ్డుకు ఇరువైపుల గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రతి రోజు ఇక్కడట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ కృష్ణ భగవాన్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగరావు ఆదివారం కాంట్రాక్టర్ జెపి కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌ను సంప్రదించి రోడ్డుకి ఇరువైపులా గ్రావెల్ మట్టి వేయించి గుంతలను స్వయంగా దగ్గర ఉండి పూడ్చారు. ఈ సందర్భంగా రోడ్ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ట్రాఫిక్ ఎస్ఐ గరగరావును, సిబ్బందిని పలువురు అభినందించారు.

యుద్ధాల పేరుతో ప్రపంచ శాంతి దూరం

ప్రజాశక్తి - రామచంద్రపురం

సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాల పేరుతో ప్రపంచ ప్రజలకు శాంతి సుఖమైన జీవితాన్ని లేకుండా చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర నాయకులైన డేగ ప్రభాకర్ అన్నారు. సిపిఐ రామచంద్రపురం ఏరియా 18వ మహాసభ డాక్టర్ చెలికాని రామారావు భవనం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులైన డేగ ప్రభాకర్ మాట్లాడుతూ సిపిఐ 100వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జరిగే మహాసభలు జయప్రదం చేయాలన్నారు. డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ అలాగే జులై 19, 20, 21 తేదీల్లో అమలాపురంలో జరుగు సిపిఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ వి.శామ్యూల్ మాట్లాడుతూ జిల్లా ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ వచ్చే నెల 6న రామచం ద్రపు రంలో నిర్వహిస్తారన్నారు. ఈ మహాసభలో సిపిఐ ఏరియా కార్య దర్శిగా పెద్దిరెడ్డి రాము, సహాయ కార్యదర్శిగా వి.రాంబాబు, 13 మందిని కార్యవర్గ సభ్యులు ఆమోదిం చారు.సిపిఐ నాయకురాలు ఎస్.శారదా దేవి ఈ మహాసభ జయప్రదం చేసిన వారికి అభినందనలు తెలిపారు.

యాంత్రీకరణతో మెరుగైన ఫలితాలు

వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యాంత్రీకరణ విధానంలో వ్యవసాయ సాగు చేయడం మెరుగైన ఫలితాలను ఇస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా తాజాగా ఖరీఫ్‌సాగుకు రైతాంగం సిద్ధమవుతున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లాలో 675 యూనిట్స్‌కి రూ.3.58 కోట్ల మేర రాయితీపై యంత్ర పరికరాలు ఇటీవల అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఆయనను పలకరించింది.

జిల్లాలో 675 యూనిట్స్‌కి ఏ మేరకు రాయితీ ఇచ్చారు?

వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్స్ ఏర్పాటుకు సంబంధించి 211 రైతు సేవా కేంద్రాల పరిధిలో 675 వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ చేశాము. వీటి ద్వారా రూ.3,58,27,637లు సబ్సిడీ రూపంలో రైతులకు ప్రయోజనం చేకూరింది. గ్రామ, మండల స్థాయిలో ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతన్నలు పరస్పరం మార్పిడి చేసుకోవడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవచ్చు. యంత్ర పరికరాల వినియోగంతో వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ప్రకృతి సాగు విస్తీర్ణం ఎంత పెంచాలి?

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 2.07 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి సారించాలి. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి. రైతు సేవా కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక పరికరాలు, యూనిట్స్‌ను అవసరానికి అనుగుణంగా ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని వాటి ద్వారా పొందే ప్రయోజనాలు అందరికీ అందుబాటులో దక్కేలో చూసుకోవాలి. అదేవిధంగా పంట మార్పిడి విధానాలు స్వాగతించాలి.

డ్రోన్ టెక్నాలజీతో ఎంతో మేలు ?

నూతన సాంకేతిక ఆవిష్కరణలు, పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులకు డ్రోన్లను ఎంతో లాభసాటిగా ఉంటాయి. డ్రోన్ టెక్నాలజీ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు వెదజల్లే ప్రక్రియను వ్యవసాయ సాగు పద్ధతుల్లో అమలు చేయాలి. అందువలన



క్రిమి సంహారక మందులు ప్రభావం రైతులపై పడే అవకాశం తక్కువ స్థాయిలో ఉంటుంది. వృధాను గణనీయంగా తగ్గించడం ఈ ప్రక్రియలో సాధ్యం అవుతుంది. ఒకరి వద్ద ఉన్న యాంత్రీకరణ యూనిట్స్ మరొకరితో పంచుకోవడంపై దృష్టి పెట్టాలి.

వ్యవసాయ రంగంలో మార్పులకు అనుగుణంగా సాగు విధానాలు ?

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. రసాయన ఎరువుల వినియోగం పెరుగటంతో చీడపీడలు తెగుళ్ల అధికమవుతాయి. ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించటం వల్ల సాగుపై ఖర్చుల భారం తగ్గటంతో పాటు భూసారం పెరుగుతుంది. జీవ సంబంధమైన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తున్న విషయం ప్రతి ఒక్కరికీ విదితమే. నేటి ఆధునిక కాలంలో వ్యవసాయ రంగంలో మార్పులు గమనించి ఉత్తమ సాగు విధానాలు అవలంబించాలి.

అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


జిల్లాలో అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు నిర్వహించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. ఆదివారం నవోదయం 2.0 అమలు, పురోగతిపై ఆయన జిల్లా అధికారులు, అన్ని స్టేషన్ హౌస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాను అక్రమ స్వేదన(ఐడి) మద్యం రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో జిల్లా అంతటా దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం తయారీలో పాల్గొన్న నల్ల బెల్లం సరఫరాదారులపై తగిన చట్టపరమైన నిబంధనల కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. పునరావృత నేరస్థులు, అలవాటుగా ఉల్లంఘించేవారిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రివెంటివ్ డిటెన్షన్ పీడీ చట్టం కింద అరెస్టులు చేయాలని ఆదేశించారు. పొరుగు జిల్లాల్లో ఇటీవల గుర్తించబడిన కల్తీ మద్యం కేసుల నమోదు అయ్యాయని, కావున మద్యం సేవించే వారు లైసెన్స్ పొందిన రిటైల్ దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేసేలా అవగాహన పెంచాలన్నారు. మద్యం బాటిల్ మూత తెరిచి ఉన్నా, మూత లేకుండా ఉన్నా, లేదా తారుమారు చేయబడినా మద్యాన్ని కొనుగోలు చేయవద్దని అవగాహన పెంచాలన్నారు. అక్రమంగా స్వేదనం చేయబడిన మద్యం, నకిలీ మద్యం, ఇతర ఎక్సైజ్ సంబంధిత ఉల్లంఘనలకు సంబంధించిన ఏవైనా సంఘటనలను టోల్-ఫ్రీ ఎక్సైజ్ హెల్ప్‌లైన్ 14405కు డయల్ చేయడం ద్వారా పౌరులు నివేదించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వై.చైతన్య మురళి, సహాయ కమిషనర్ ఎం.శివప్రసాద్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సిహెచ్. లావణ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ కమిషనర్ రాహుల్‌దేవ్ శర్మ

బెంబేలెత్తిస్తున్న వానరాలు

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక సంజీవయ్య నగర్ కాలనీలో వానరాలు ప్రజలను బెంబెలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అదే ప్రాంతంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులు వానరాల దాడిని తట్టుకోలేక పరుగులు పెడుతున్నారు. వానరాలకు అర్ధరాత్రి..అపరాత్రి తేడా లేకుండా వసతి గృహంలోకి ప్రవేశించి విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. భోజనాలు చేసే క్రమంలో ఒక్కసారిగా వసతి గృహంలోకి ప్రవేశించి విద్యార్థుల భోజనాలను లాక్కుపోతున్నాయి. వాటిని కొట్టేందుకు ప్రయత్నిస్తుంటే విద్యార్థులపైకి దాడికి దిగుతున్నాయి. వసతి గృహంలో వంటి చేసే సమయంలోనూ వంట చేసే సామాగ్రిని సైతం ధ్వంసం చేసి తయారు చేసిన ఆహారాన్ని పట్టుకుపోతున్నాయి. వానరాల సమస్యను పరిష్కరించాలని స్థానిక అధికారులు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వానరాల బెడదను తీర్చేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.


వసతి గృహం వద్ద వానరాల సంచారం

సైన్స్‌పై అవగాహన అవసరం: జెవివి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకునేందుకు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక(జెవివి) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భీమయ్య, ఎన్.రవిబాబు అన్నారు. ఆదివారం నగరంలోని దానవాయిపేటలోని ప్రదీప్ డయాబెటిస్ హస్పటల్ వద్ద జెవివి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెవివి సభ్యత్వ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యవంతం చేస్తుందని అన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు, చెకుముకి సైన్స్ పరీక్ష, సదస్సులు నిర్వహిస్తూ చైతన్యవంతులైన ప్రజలు జనవిజ్ఞాన వేదిక సభ్యులుగా చేరాలని కోరడం జరుగుతుందన్నారు. జీవుల జన్యు నిర్మాణం గురించి, వచ్చే రోగాలు, వాటి చికిత్స గురించి ఎంతో ముందుకు వెళ్లామని, కానీ ఇంకా మన సమాజంలో అశాస్త్రీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందనప్పారు. దీనికి సైన్సు అందిస్తున్న ఫలితాలు సామాన్యుని వద్దకు చేరకపోవడమే కారణమని తెలిపారు. సైన్స్ ఇప్పటికీ పాఠ్య గ్రంథాలలో ఉంది తప్ప జీవన విధానంగా మారలేదన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జి.తాతారావు, జిల్లా నాయకులు డాక్టర్ సి.ప్రదీప్, ఎఎన్.సుధారాణి, కె.రంగవల్లి, బిఎస్‌వివి.ప్రసాదరావు, సిహెచ్.నిశ్చల్, కెవి.గణేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

దివిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీ అయిన 11 మంది ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శ్రీవల్లి అధ్యక్షతన నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు నాగజ్యోతి, గంగాభవాని, సూరిబాబు, జగన్నాథం, జిలాని, భాషా, వరహాల బాబు, మాలతి, కరుణాకర్, విశ్వేశ్వర శాస్త్రి, ఆచార్యులు మాస్టార్లను పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యాభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎడవల్లి లక్ష్మణరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ సర్పంచ్ కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఉపాధ్యాయులు బీపెల్లి దుర్గాజీరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు సత్తిబాబు మద్దతు

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 54వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బేదంపూడి సత్తిబాబు సమ్మె శిబిరానికి వచ్చి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, బాసిన భద్రరావు, శ్రీనివాస్, అయ్యప్ప స్వామి, పూల ప్రశాంత్, మలిపెద్ది భద్రరావు, జి.నాగేశ్వరరావు, ఎస్‌కె.బషీర్ తదితరులు పాల్గొన్నారు.

1న వల్లభ ఆలయ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని జూలై 1న లెక్కించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్‌ల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు.

ఎఆర్‌ఎం చేట్ల వజ్రం సేవలు విలువైనవి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ (ఎఆర్‌ఎం)గా పని చేస్తూ అందరి మన్ననలూ పొందిన చేట్ల వజ్రం సేవలు మరువలేనివని పలువురు వక్తలు ప్రశంసించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం కాంప్లెక్స్ ఆవరణలో వజ్రం దంపతులకు ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ సేపేని సురేష్ అధ్యక్షత వహించారు. వజ్రం కషి ప్రామాణికత ఆర్‌టిసి కాంప్లెక్స్ అభివృద్ధికి ఎంతో తోడ్పడిందని నిర్వాహకులు కొనియాడారు.

మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

ప్రజాశక్తి - కొవ్వూరు

ప్రజలను నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శంచారు. ఆదివారం స్థానిక లీటరరీ క్లబ్ కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు విసుగెత్తిపో యారని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజల వద్దకు వెళ్లి గుర్తు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మోసపూరితమైన హామీలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కోడూరు శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమణి రమేష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ బండి పట్టాభిరామారావు, పార్టీ మండల అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు మట్ట వెంకటరావు, వెంపాటి సురేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని గుర్తించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. హెల్మెట్ లేకుండా బైకులు నడుపుతున్న వారికి చలానా విధించినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల నష్టాలపై వాహనదారులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

1 నుంచి టిడిపి బూత్ కన్వీనర్లకు శిక్షణ

ప్రజాశక్తి - కొత్తపేట

నియోజకవర్గ పరిధిలో టిడిపి బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్, కోఇన్‌ఛార్జిలు, క్లస్టర్, కో ఇంఛార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుకు శిక్షణా తరగతులు జులై 1న ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట కాపు కళ్యాణ మండపం నందు ఈ శిక్షణా తరగతులు ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన నిర్వహిస్తారన్నారు. టిడిపికి సంబంధించి ట్రయినీస్ శిక్షణలో పాల్గొంటారన్నారు.

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం త్రి రత్న బుద్ధ విహార్ నందు ద బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా జిల్లా సమావేశం ఆదివారం రాంబోది కాశి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జూలై 25వ తేదీన 'బుద్ధినితో నా ప్రయాణం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అనే నాటకం' అమలాపురంలోని ఇండోర్ స్టేడియంలో ప్రదర్శిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఈ నాటకాన్ని అంబేద్కరీయులు, బౌద్ధ ఉపాసకులు, ధమ్మ బోధకులు, బహుజనులు ప్రతీ ఒక్కరూ తిలకించాలని ఆయన న్నారు. అదే విధంగా బిఎస్ఐ సభ్యత్వ నమోదు ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.బి.లోక్, జిల్లా ఉపాధ్యక్షులు కోలా త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, కె.భరత్ కుమార్ సింహ బోధి, డాక్టర్ పి.నాగేశ్వరరావు, ఇవివి.సత్యనారాయణ, బొంతు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


చంద్రమోహల్ నోబిస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ అధికారులు

ఘనంగా చంద్రమోహల్ నోబిస్ జయంతి

ప్రజాశక్తి - గోపాలపురం

భారతీయ గణాంక శాస్త్ర పితామహుడు చంద్రమోహల్ నోబిస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ జోడాల వెంకట్ ప్రశాంత చంద్ర మోహన్ నోబిస్ 'మహాలనోబిస్ దూరం' అనే గణాంక కొలతను కనుగొన్నట్లు తెలిపారు. గణాంకశాస్త్రంలో పరిశోధనలు చేసిన ఆయన భారతదేశ రెండవ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో పాలుపంచుకున్నాడని గుర్తు చేశారు. 1957లో అంతర్జాతీయ గణాంక సంస్థ గౌరవ అధ్యక్షుడిగా నియమితులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ సహాయకులు నల్లరాజు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.


వేగేశ్వరపురంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం

సాయి స్ఫూర్తి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజల అవసరాలను గుర్తించి ఆయా గ్రామాలలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సాయి స్ఫూర్తి ఆసుపత్రి సేవలు అభినందనీయమని వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మి రెడ్డి పరశురామారావు అన్నారు. ఆదివారం సాయి స్ఫూర్తి హాస్పటల్ ఆధ్వర్యంలో వేగేశ్వరపురంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిఇఒ గూడా రాజు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల వైద్య సేవలతో 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వివి.వర్మ, డాక్టర్ రామారావు, డాక్టర్ మౌనిక, డాక్టర్ వందన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

తీరనున్న తాగునీటి సమస్య

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం గ్రామంలో ఎండి పేట వాసుల నీటి సమస్య తీరనుందని సర్పంచ్ బొంతా భరత్‌బాబు అన్నారు. ఆదివారం రూ.10 లక్షల జడ్‌పి నిధులతో పంచాయతీ వద్ద బోరు నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997లో అప్పటి ఎంఎల్‌ఎ జొన్నకూటి బాబాజీరావు రూ.20 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మించారని, ఆ ప్రాంతంలో బోరు పడకపోవడంతో పలుమార్లు ప్రయత్నించి విఫలం కావడంతో నాటి నుంచి ఈ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా లేకుండా పోయిందన్నారు. ఆ సమస్యను ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు దృష్టికి తీసుకెళ్లడంతో జడ్‌పి నుంచి రూ.10 లక్షల మంజూరు చేయించారని తెలిపారు. ఆ నిధులతో బోరు నిర్మాణం పనులు పూర్తి చేసి పైప్ లైన్ ద్వారా వాటర్ ట్యాంక్‌కు నీరు అందిస్తామని తెలిపారు.

పరిటాల సునీత రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

రాప్తాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు విఘాతం కల్గించిన రాప్తాడు ఎంఎల్‌ఎ పరిటాల సునీత తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని మాలసంఘాల జెఎసి కన్వీనర్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 నుంచి రాప్తాడులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులు చేస్తున్నారన్నారు. ఆదివారం విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసుల ద్వారా అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేయడం జీర్ణించుకోలేని పరిటాల సునీత ఇటువంటి దిగజారుడు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. విగ్రదీవవిష్కరణ అడ్డుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు.

నేడు సిఎం పర్యటనపై సమావేశం

ప్రజాశక్తి - కొవ్వూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీన మలకపల్లి పర్యటనపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మలకపల్లిలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

పశివేదలలో జగన్నాథ స్వామి రథయాత్ర

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని పశివేదల గ్రామంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్, టిడిపి నేత రాజీవ్‌కృష్ణ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి, స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు జగన్నాథ స్వామి రథాన్ని, గ్రామస్తులతో కలిసి కొద్ది దూరం లాగారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు పికె. రంగారావు, వేగి చిన్నా, పరిమి హరిచరణ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-కాజులూరు

ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తామని మంజేరు సర్పంచ్ గుంటూరు అప్పారావు తెలిపారు. మూడు రోజులుగా గ్రామంలో తాగునీరు లేకపోవడంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని సర్పంచ్ గుంటూరు అప్పారావు తెలిపారు. గొల్లపాలెం తాగునీటి పంపిణీ పథకం ద్వారా పైప్‌లైన్ నుంచి మంజేరు వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా చేస్తున్నప్పటికీ మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారు. రెండు రోజుల నుంచి గ్రామీణ నీటి సరఫరా అధికారుల ద్వారా మరమ్మతులు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఇంటింటికీ ట్యాంకర్ ద్వారా చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే జల్‌జీవన్ మిషను పనులను గ్రామంలో ప్రారంభించాలని సర్పంచ్ అప్పారావు కోరారు. జల్ జీవన్ పనులు పూర్తయితే గ్రామంలో తాగునీరు ఇబ్బందులు ఉండవని ఆయన తెలిపారు.